క్లుప్తంగా

రక్తదాన శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ, సీఐ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని చెప్పారు. హౌసింగ్ బోర్డు కాలనీ, వెంకట్‌రమణనగర్, నారాయణనగర్ కాలనీ ప్రజలు రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టౌన్ సీఐ శివలింగం, ఎస్‌ఐ కాశీనాథ్, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో సీపీఐ నాయకులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ సీపీఐ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం ఛలో హైదరాబాద్ నిర్వహించారు. ఆందోళనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ సీపీఐ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. అరెస్టయినవారిలో నాయకులు దత్తురెడ్డి, సీహెచ్. అశోక్, ఆనంద్ ఉన్నారు. సాయంత్రం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

ప్రతిభ పరీక్షల్లో సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభ పరీక్షలో ఖేడ్ బోధి పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న కె.అవంతిక 6వ ర్యాంకు, ప్రిన్సీ 21వ ర్యాంకులను సాధించి పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ



సంజీవ్‌పటేల్‌ను పరామర్శిస్తున్న బీబీ పాటిల్

నారాయణఖేడ్: బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న బీజేపీ నాయకులు సంజీవ్ పటేల్‌ను మాజీ ఎంపీ బీబీ పాటిల్ నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినికాంత్, సాయిరాం, అరుణ్‌రాజ్, సిద్ధయ్యస్వామి, సతీష్, సాయేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

జిన్నారం ఎస్‌ఐ నాగలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగలక్ష్మి

జిన్నారం (పటాన్‌చెరు): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిన్నారం ఎస్‌ఐ నాగలక్ష్మి అన్నారు. శనివారం జిన్నారం గ్రామపంచాయతీ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి లావాదేవీలకు ఓటీపీ నంబర్లు, ఇతర వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. ప్రస్తుతం కేటుగాళ్లు ఆధునిక పరిజ్ఞానంతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, జగన్ రెడ్డి, గ్రామస్తులు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



సంగారెడ్డి రూరల్: జహీరాబాద్: హనుమాన్ విగ్రహాన్ని అలంకరించిన భక్తులు



సంగారెడ్డి: వీరహనుమాన్ విజయయాత్ర ర్యాలీలో యువత

హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో భక్తులు జెండాలు చేతబూని హనుమాన్ నామస్మరణతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు చోట్ల అన్నదానం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ఖమ్మంపల్లిలో భజన చేస్తున్న భక్తులు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



సంగారెడ్డి పట్టణంలో..



జిన్నారం (పటాన్‌చెరు): బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



హత్నూరలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు, యువత



సదాశివపేట పట్టణం హనుమాన్ నగర్‌కాలనీలో..

తాగు నీటికోసం తండ్లాట

- వారం రోజులుగా భగీరథ నీరు బంద్
- వ్యవసాయ క్షేత్రాలకు పరుగులు

నారాయణఖేడ్: మండలంలోని శేరితండాలో వారం రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తండావాసులు అల్లాడుతున్నారు. తండా శివారులోని వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై నీటిని మోసుకువస్తున్నారు. నీళ్లను పట్టుకోవడానికి ఎగబడుతుండటంతో గొడవలు జరుగుతున్నాయని వాపోయారు. తండాలో 600 మంది జనాభా ఉంటారు. అధికారులు అసలు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఫలితంగా నిత్యం నీటి కోసం పిల్లాపాపలతో వ్యవసాయ క్షేత్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటి సరఫరాను పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.



బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న తండావాసులు

బాన్సువాడలోతాగునీటి కటకట

కంగ్టి(నారాయణఖేడ్):మండలంలోని బాన్సువాడ గ్రామంలో తాగునీటి తిప్పలు తీరడం లేదు. దాదాపు నెల రోజుల నుంచి నీరు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శివారులోని వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి నీరు మోస్తున్నామని తెలిపారు. పొలం గట్లుపై నుంచి నీటి బిందెలు మోసుకుని రావడం చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ సెక్రటరీలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నీటి కోసం పంట పొలాల వద్ద మహిళలు

రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న భూపాల్‌రెడ్డి



జహీరాబాద్: మాట్లాడుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధి కోహీర్‌లోని ఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు భారీ సంఖ్యలో తరలి వెళ్లాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంతో విసిగిపోయి ఉన్నారని, తిరిగి బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, నర్సింహులు, నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, నర్సింహాగౌడ్, మొహియొద్దీన్ ఉన్నారు.

నారాయణఖేడ్: 27న వరంగల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించి చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను శనివారం ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, మాజీ కౌన్సిలర్లు అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు.

చలో వరంగల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం (పటాన్‌చెరు): చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, వెంకటేశం గౌడ్‌లు శనివారం బొల్లారంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 27 తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 4 వేల మంది కార్యకర్తలతో తరలించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ప్రకాశం చారి.సురేందర్ గౌడ్, ఆంజనేయులు, శివరాజ్, కౌన్సిలర్లు బీరప్ప యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): మక్తక్యాసారం ఆత్మానందాశ్రమ 25వ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆయా గ్రామాల్లో భక్తులు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, చీలపల్లి, గార్లపల్లి, చిన్నచల్మెడ, పొల్కంపల్లి గ్రామాల్లో కరపత్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ నెల 14న నర్సాపూర్ మండలం రుస్తుంపేటల (నృసింహపురం) ఆత్మానందాశ్రమ పీఠాధిపతి శ్రీ భగవద్భక్త పరాగ పూజ్య పాద రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో గురు వందనం, గణపతి పూజ, పుణ్యావచనం, శతరుద్ర పారాయణ, చండీహవనం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మహాదాశీర్వచన కార్యక్రమం ఉంటుందన్నారు. పూజలకు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేలరాలిన మామిడి కాయలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మాసాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీగా వీచిన గాలులకు గ్రామానికి చెందిన నారాయణ రావు మామిడితోటలోని కాయలు నేలరాలాయి. దీంతో బాధిత రైతు మామిడికాయలు చాలా వరకు రాలిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేడు ఉచిత కార్డియాక్ హెల్త్ క్యాంపు

కంగ్టి(నారాయణఖేడ్): కాంటినెంటల్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంగ్టిలోని నిర్మల రత్న హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత కార్డియాక్ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు శనివారం వైద్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో ప్రముఖ న్యాయవాది అనిల్‌రెడ్డి పర్యవేక్షణలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ సీ.వీ.ఎస్ మూర్తి బృందంతో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. క్యాంపులో 2డీ ఈకో వంటి టెస్ట్ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఛాతీలో మంట, కుడిభుజం నుంచి వీపులో లాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నవారు శిబిరంలో వైద్యసేవలు పొందాలని తెలిపారు.

హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్ రావు అన్నారు. శనివారం రాత్రి తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. ఎన్నికల ముందు ఈ ప్రాంతంలోని ప్రజలు పోస్టాఫీస్ కావాలని అడిగారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల కాలంలో నూతన పోస్టాఫీస్ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఎంఎంటీఎస్ రైల్వే సర్వీస్‌లను పెంచేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రజలు వాయు కాలుష్యం, నీటి కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరలో కాలుష్య నియంత్రణ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీ

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సంగారెడ్డి టౌన్ : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్‌సీయూ కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ నేత నవీన్ అన్నారు. శనివారం కంది మండలంలోని సెంట్రల్ జైలు నుంచి నవీన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు హెచ్‌సీయూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూముల వేలం వేయవద్దని ఆపాలంటూ ఆందోళన చేసిన విద్యార్థి నవీన్‌ను అరెస్టు చేసి 12 రోజుల పాటు జైలులో పెట్టారు. శనివారం బెయిల్ రావడంతో విడుదలయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకొని విద్యార్థి సంఘాలు ,ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



నవీన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చివరి గింజ వరకు కొంటాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలం పరిధి సంజీవన్‌రావుపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడంతో పాటు రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని తెలిపారు. ముఖ్య నాయకులు మాణిక్ గౌడ్, నర్సింహులు, రమేష్ చౌహాన్, సాయిలు, అంజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం

రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నిజాంపేట్ మండలం నాగ్‌ధర్, బాచేపల్లి గ్రామాల్లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

దళితుడి ఇంట్లో ఎమ్మెల్యే భోజనం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో శనివారం దళితుడు కిష్టయ్య కుటుంబంతో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా సన్నబియ్యం ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడ్పల్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నారాయణఖేడ్: బాచేపల్లిలో..



కల్హేర్: కడ్పల్‌లో భోజనం చేస్తున్న సంజీవరెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని 15 మందికి లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు రూ. 4.22 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల బాధితులకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు, ఆయా గ్రామాల నాయకులు , మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

◆ **హజ్ యాత్రికులకు సత్కారం**

జహీరాబాద్: హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులను శనివారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. యాత్రకు వెళ్తున్న వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డీ.తన్వీర్, కాంగ్రెస్ నాయకులు కండెం నర్సింహులు, పి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, షాకీర్, అశోక్, జావీద్, మొయిజొద్దీన్, ఇనాయత్, అయూబ్‌లు పాల్గొన్నారు.

◆ **విశ్వపాలిని మందిరంలో చండీయాగం**

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని జ్వాలముఖి భవాని సమేత సేవలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం ఏకోన వింశతి చండీయాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. మహారాష్ట్రలోని లాతుర్‌కు చెందిన అంకుశ్ శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రలు పఠించారు. హారతీ, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రూప్‌సింగ్, కిషన్ పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని మెలగిరిపేట్‌లో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. అలాగే, గంగకత్వ వాగుపై మరమ్మతు చేయాల్సిన వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు సిద్దన్న, సత్యనారాయణ ఉన్నారు.

◆ **నేడు మెగా రక్తదాన శిబిరం**

నారాయణఖేడ్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఖేడ్‌లోని పల్లవి మోడల్‌స్కూల్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఉ. 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఖేడ్ బ్లడ్‌డోనర్స్ గ్రూపు, కేవీపీఎస్, ఇండియన్ నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శిబిరం కొనసాగుతుందని సభ్యులు ముజామిద్ చిస్తీ, ఓం ప్రకాష్, సంతోష్‌రావు, కొటారి నర్సింహులు, సంతోష్‌కుమార్, గణపతి తెలిపారు.

◆ **హనుమాన్ ఆలయానికి విరాళం**



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ హనుమాన్ ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నగేష్ శనివారం రూ.లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హనుమాన్ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అమరేందర్ రెడ్డి, గంగన్న,మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **మూగజీవులకు నీటి కష్టాలు**



జహీరాబాద్ టౌన్: ఎండలు ముదురుతుండటంతో మూగజీవాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.. నోరు తెరిచి అడగలేని మూగజీవులు నీరు దొరక్క దాహంతో అల్లాడుతున్నాయి. తాగునీటి కోసం వెంపర్లాడుతున్నాయి. పట్టణంలోని శ్రీరాం వీధిలో శుక్రవారం ఓ కుళాయి వద్ద మేక పిల్ల దహం తీర్చుకొనేందుకు నానాతంటాలు పడింది. నల్లా నుంచి బొట్లు.. బొట్లుగా కారుతున్న నీటి చుక్కలను తాగుతుండటం కనిపించింది.

◆ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

జహీరాబాద్: నియోజకవర్గంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉ.7.30 గంటల నుంచి 10 గంటల వరకు జహీరాబాద్ 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, జహీరాబాద్, కోహీర్ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.

◆ **వనజీవి రామయ్య మృతికి సంతాపం**

జిన్నారం (పటాన్‌చెరు): వనజీవి రామయ్య మృతికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్‌ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సంతాపం తెలిపారు. శనివారం గుమ్మడిదలలో ఆయన మాట్లాడుతూ.. పద్మశ్రీ వనజీవి రాజయ్య వనసంరక్షణ కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన నిస్వార్థ సేవ ఆదర్శమన్నారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

◆ **హనుమాన్ విగ్రహంతో ర్యాలీ**

జహీరాబాద్: పట్టణంలో శనివారం రాత్రి హనుమాన్ విగ్రహంతో శోభాయాత్రను నిర్వహించారు. హనుమత్ జయంతిని పురస్కరించుకుని మాణిక్‌ప్రభు వీధిలోని హనుమాన్ మందిరం నుంచి యాత్ర ప్రారంభమై రాంమందిర్ మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, వీరహనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.